www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం


శుక్రవారం 14.02.2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశెలపై అవగాహన ఉండి.. రెయగల వెరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




# మరిన్ని కొలువులు

2లో

- కృత్రిమ మేధకు అధిక ప్రాధాన్యం
- ఏఐ సిటీలో దిగ్గజ కంపెనీలు
- మైక్రోసాఫ్ట్ నూతన ప్రాంగణ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఏఐ సెంటర్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వంతో మైక్రోసాఫ్ట్ ఒప్పందం

# ఓటీపీలు చెప్పొద్దు

## ట్రాయ్ హెచ్చరిక




న్యూ ఢిల్లీ : 116 కోట్ల మంది మొబైల్ వినియోగదారులకు మరోమారు ట్రాయ్ (టీఆర్ఏఐ–టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) గురువారం హెచ్చరికలు జారీ చేసింది. ఎస్ఎంఎస్ , కాల్స్, సంక్షేమ పథకాల పేరిట వచ్చే వారికి ఎలాంటి ఓటీపీలు చెప్పవద్దని, అదే సమయంలో విదేశీ గుర్తు తెలియని కాల్స్ ను లిఫ్ట్ చేయొద్దని హెచ్చరించింది. అలాంటి వాటిని వెంటనే బ్లాక్ చేసేయాలని స్పష్టం చేసింది. దేశంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేసింది. ఎప్పటికప్పుడు ట్రాయ్ మొబైల్ వినియోగదారులకు సమాచారాన్ని అందజేస్తుందని తెలిపింది. టెలికాం సంస్థలు చట్టవిరుద్ధమైన కార్యకలాపాల సందేశాలు, ఫోన్లు చేయవని గుర్తుంచుకోవాలని స్పష్టం చేసింది.

# మత్స్య 6000 సిద్ధం




## కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ: భారత్ తొలి మానవ సహిత సబ్ మెర్సిబుల్ 'మత్స్య 6000' 2026న ప్రయోగం చేపడతామని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో లిఖిత పూర్వకంగా తెలిపారు. ముగ్గురు వ్యక్తులతో ఈ ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు వివరించారు. డీప్ ఓషన్ మిషన్ లో భాగంగా శాస్త్రీయ సెన్సార్ల సూట్ తో సముద్ర జీవవైవిధ్యాన్ని అన్వేషణ, సర్వే, ఖనిజాన్వేషణ చేస్తుందన్నారు. నీటి అడుగున అద్భుతమైన ఇంజనీరింగ్ ఆవిష్కరణగా పేర్కొన్నారు. మత్స్య 6000 మిషన్ ప్రాజెక్టును ఇస్రో సహకారం అందజేస్తుంది. ఈ తేలియాడే సబ్ మెర్సిబుల్ లో యంత్రంలో పవర్ కంట్రోల్ సిస్టమ్‌లు, మ్యానూరింగ్ ప్రొఫెల్లర్లు, సబ్ సీ ఇంటర్వెన్షన్ మానిప్యులేటర్లు, నావిగేషన్, పొజిషనింగ్ పరికరాలు, డేటా, వాయిస్ కమ్యూనికేషన్ సిస్టమ్‌లు, ఆన్‌బోర్డ్ ఎనర్జీ స్టోరేజ్ బ్యాటరీలు, అత్యవసర మద్దతు వ్యవస్థలు కూడా ఉన్నాయని సింగ్ చెప్పారు. ఈ ప్రయోగం సముద్రం ఉపరితలం నుంచి ఆరువేల మీటర్ల లోతులో 96 గంటలపాటు నిరంతరం కార్యకలాపాలను నిర్వహిస్తుందని చెప్పారు.




### ప్రత్యేక ఎంపీటీసీగా

# ఏర్పాటు చేయాలి

**ఎంపీడీవోకు సీపీఎం వినతిపత్రం**

**కలంజ్యోతి, నర్సంపేట :** పాత ముగ్దుంపురం గ్రామాన్ని గురజాల ఎంపీటీసీలో కలపడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) జిల్లా కమిటీ సభ్యులు పరికి మధుకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి ఆనుకొని ఉన్న పాత ముద్దుంపురం గ్రామాన్ని ప్రత్యేక ఎంపీటీసీగా ఏర్పాటు చేయాలి లేదా చెన్నారావుపేట ఎంపీటీసీలో కలపాలని సీపీఎం ఆధ్వర్యంలో నర్సంపేట ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రకళకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకులు ఏనుగుతల నరేష్, జన్ను రమేష్, డీవైఎఫ్ఐ డివిజన్ నాయకులు గడ్డమీది బాలకృష్ణ, వెంకన్న, నర్సింగరావు, కార్తీక్, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# 182 కిలోల బాంబు నిర్వీర్యం

**డీస్పూర్ :** అసోంలో గత సంవత్సరం కనుగొన్న రెండో ప్రపంచ యుద్ధం నాటి 182 కిలోల భారీ బాంబును గురువారం నిర్వీర్యం చేశారు. ఈ బాంబును లఖింపూర్ జిల్లా జిలి నది ఒడ్డున వైమానిక దళం గుర్తించిందని జిల్లా డిప్యూటీ కమిషనర్ ప్రణబ్ జిత్ కకోటి తెలిపారు. బాంబు లభించినప్పుడు యాక్టివ్ గానే ఉన్నట్లుగా గుర్తించామన్నారు. దులుంగ్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఈ బాంబును నిర్వీర్యం చేశామన్నారు. బాంబును నిర్వీర్యం చేయడానికి ముందు వన్యప్రాణులకు కూడా ఎటువంటి హాని జరగకుండా అన్ని రకాల చర్యలను తీసుకున్నామని తెలిపార. 35 కి.మీ. ప్రాంతాన్ని ఖాళీ చేయించామన్నారు. ప్రక్రియ విజయవంతమైనట్లు ప్రకటించారు.



# సరిహద్దులో పాక్ కాల్పులు

### భారత కాల్పుల్లో ఐదుగురు పాక్ జవాన్లు మృతి

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ పూంచ్ జిల్లా బాలాకోట్ సెక్టార్ సరిహద్దులో భారత స్థావరాలపై పాక్ సైన్యం కాల్పులకు పాల్పడింది. ప్రతీకార చర్యగా భారతసైన్యం ధీటుగా సమాధానం ఇవ్వడంతో 4 నుంచి ఐదుగురు పాక్ సైనికులు మృతిచెందినట్లు తెలుస్తుంది. గురువారం వేకువజామున పాక్ సరిహద్దు వైపు నుంచి ఉన్నట్లుండి ఆర్మీ పోస్టులపై కాల్పులకు తెగబడింది. వెంటనే అప్రమత్తమైన ఆర్మీ ఓ వైపు చొరబాట్లపై నిఘా పెడుతూనే మరోవైపు వారికి ధీటైన సమాధానం ఇచ్చింది. పాక్ సరిహద్దుల వెంట కుట్రలపై జమ్మూకశ్మీర్ ఎల్జీ గవర్నర్ మనోజ్ సిన్హా ఉన్నతస్థాయి భద్రతా సమావేశాన్ని నిర్వహించనున్నారు.


# మరిన్ని కొలువులు

- కృత్రిమ మేధకు అధిక ప్రాధాన్యం
- ఏఐ సిటీలో దిగ్గజ కంపెనీలు
- మైక్రోసాఫ్ట్ నూతన ప్రాంగణ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఏఐ సెంటర్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వంతో మైక్రోసాఫ్ట్ ఒప్పందం




**కలంజ్యోతి, హైదరాబాద్:**

యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ఏఐ) కే ప్రాధాన్యం పెరుగుతుందని, అందులో తెలంగాణ విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని నెలకొల్పుతోందన్నారు. దిగ్గజ కంపెనీలు ఇందులో తమ కేంద్రాలను నెలకొల్పడానికి ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక కంపెనీ 'మైక్రోసాఫ్ట్'కి చెందిన రెండో కార్యాలయం హైదరాబాద్‌లో ఉందని, ఇప్పుడు దీన్ని విస్తరించడం గర్వకారణమని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని మైక్రోసాఫ్ట్ కార్యాలయ విస్తరణలో భాగంగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌కుమార్, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐ సిటీలో తమ కంపెనీ కేంద్రం ఏర్పాటుపై మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఇటీవలే 25 ఏళ్లు పూర్తిచేసుకున్న దిగ్గజ కంపెనీ మైక్రోసాఫ్ట్ ఇండియా హైదరాబాద్‌తో సన్నిహిత, సుదీర్ఘ అనుబంధాన్ని కొనసాగిస్తోంది. మైక్రోసాఫ్ట్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. 'అడ్వాంటా (ఐ) జీఈ తెలంగాణ'ను ప్రారంభించడంలో భాగస్వాములుగా ఉన్నాయి. ఇందులో ఏఐ ఫౌండేషన్ అకాడమీ కూడా ఉంది. ఈ భాగస్వామ్యంతో 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్యను ప్రవేశపెట్టనున్నాం. సుపరిపాలన, ప్రజాసేవ కోసం కూడా ఏఐని ఉపయోగిస్తాం. ఇది మా స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. మెంటార్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను అందిస్తుంది. మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటుతో నాలెడ్జ్ హబ్, క్లౌడ్ ఆధారిత మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



### 1.2 లక్షల మందికి ఏఐలో శిక్షణ

హైదరాబాద్‌లో నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం సందర్భంగా మైక్రోసాఫ్ట్ తమ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 1.2 లక్షల మందికి పైగా ఏఐ శిక్షణను అందించేందుకు మూడు కొత్త ప్రోగ్రాంలను ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ భారతదేశంలో ఇప్పటికే 20 వేల మందికి పైగా నిపుణులను నియమించింది. వీరిలో సగానికి పైగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. 11 లక్షల చ.అ. విస్తీర్ణంలో అధునాతన ప్రమాణాలతో నిర్మించిన కొత్త భవనం ప్రారంభంతో మైక్రోసాఫ్ట్ మరో 4,800 మంది ఉద్యోగులను నియమించుకోవాలని యోచిస్తోంది. 'అడ్వాంటా(ఐ) జీఈ తెలంగాణ' కార్యక్రమం పేరిట మైక్రోసాఫ్ట్.. 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు ఏఐ ఫౌండేషన్స్ అకాడమీని ప్రారంభిస్తోంది. 'ఏఐఇండస్ట్రీ ప్రో' పేరుతో మరో కార్యక్రమాన్ని చేపడుతుంది. రాష్ట్రమంతటా 20 వేల మంది పరిశ్రమల నిపుణులకు నైపుణ్యాలను నేర్పిస్తుంది. 'ఏఐగవర్న్ ఇనీషియేటివ్' పేరుతో దాదాపు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీ వంటి కీలకమైన రంగాల్లో శిక్షణ ఇస్తుంది. తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ని స్థాపించనుంది. ఏఐ నాలెడ్జ్ హబ్‌తో పాటు ఏఐ అభివృద్ధికి క్లౌడ్‌ఆధారిత మౌలిక సదుపాయాలు ఇందులో ఉంటాయి. రాష్ట్రంలో వేల మంది ఉద్యోగులకు ఉపయోగపడేలా కేస్ స్టడీస్, ఉత్తమ పరిశోధన పద్ధతులను అందుబాటులో ఉంచుతుంది. రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో రాబోయే సంవత్సరాల్లో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. దీంతో హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు అతిపెద్ద డేటా హబ్‌గా అవతరించనుంది. దీనికి సంబంధించి మైక్రోసాఫ్ట్ కంపెనీ గురువారం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. 2025 జనవరిలో సీఎం రేవంత్‌రెడ్డి.. మైక్రోసాఫ్ట్ ఛైర్మన్ సత్య నాదెళ్ల మధ్య జరిగిన సమావేశ ఫలితమే ఈ ఒప్పందమని ప్రభుత్వం పేర్కొంది.

కలంజ్యోతి 3
శుక్రవారం 14.02.2025 Local News



## యువత క్రీడల్లో రాణించాలి

### చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజ్జు భాయ్

**కలంజ్యోతి, వేములవాడ :** యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజ్జు భాయ్ అన్నారు. గురువారం చందుర్తి జనతా గ్యారేజ్ వర్క్ షాప్ వద్ద.. జూనియర్ వాలీబాల్ క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేశారు.. ఈ సందర్భంగా స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మాట్లాడుతూ... యువకులు చెడు అలవాటులకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి పెట్టాలని సూచించారు.. క్రీడలపై ఆసక్తి పెంచుకొని క్రీడల్లో రాణించాలని తెలిపారు.. గ్రామీణ క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాల కళాశాలల్లో పీఈటీలను నియమించి క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలోజూనియర్స్ క్రీడాకారులు నిఖిల్, ప్రమేష్ రాఘవ, ప్రవీణ్, శివ, సన్నీ ,అభిషేక్, సాయి చరణ్, మనోజ్, ఇర్ఫాన్, మహేష్ ,జహీర్, గణేష్ ,భావేష్, యుగంధర్, శ్రీశాంత్, శ్రీవర్ధన్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

### నిర్మల్ కలెక్టర్ అభిలాష



**కలంజ్యోతి, నిర్మల్ :** త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పంచాయితీ ఎన్నికల నిర్వహణ, ఆర్ఓ, ఏఆర్ఓ ల విధులు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల నిర్వహణ, విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుండి ఎన్నికల లెక్కింపు వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని రకాల పత్రాలను జాగ్రత్తగా పూరించాలన్నారు. రోజువారిగా ఎన్ని నామినేషన్లందాయో వివరాలను గ్రామపంచాయతీ నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అనర్హమైన నామినేషన్లను తొలగించాలన్నారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ల చివరి రోజు నాటికి ఒక నామినేషన్ కు మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ఒకవేళ నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు వ్యక్తికి తిరస్కరణ పై అపీలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికలకు 44 గంటల ముందు నుంచి ప్రచారానికి అనుమతి ఉండదన్నారు. ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ తనిఖీ, సీల్ వేయటం, తదితర ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు తమ వెంట ప్రభుత్వంచే గుర్తించబడిన ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలని, గుర్తింపు కార్డు చివరి 4 అంకెలు సంబంధిత ఫారంలో నమోదు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లుబాటు కానీ ఓట్ల గుర్తింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ లు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక శ్రేయస్సే ఐఎన్‌టీయూసీ లక్ష్యం

### ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాజశేఖర్ గౌడ్

**కలంజ్యోతి, నర్సాపూర్ :** కార్మిక శ్రేయస్సే ఐఎన్టీయూసీ లక్ష్యమని ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర రాజశేఖర్ గౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని హత్నూర మండలంలోని ఏపీ టోరియా ఫార్మా యూనిట్ 19 హానర్ ల్యాబ్ లేబరీ పరిశ్రమలో గురువారం పర్యటించారు. కార్మికులకు భద్రత, ఈఎస్ఐ, కనీస వేతనం, నెలవారి పని దినాలు తదితర అంశాలపై యాజమాన్యంతో చర్చించారు. కార్మికులకు ఐఎన్ టీయూసీ కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బట్టు మారుతిరాజు, కృష్ణరాజు ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.




## మల్యాల క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదం

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల క్రాస్ రోడ్డు వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం డీసీఎంఎస్ (ఐచర్) వ్యాన్ బీభత్సం సృష్టించింది. ఐచర్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంతో ఎదురుగా వస్తున్న లారీ, ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దాంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ తలెత్తింది. వివరాలు ఇలా ఉన్నాయి... రాజస్థాన్ కు చెందిన ఐచర్ వ్యాన్ జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తోంది. మల్యాల క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా బియ్యం లోడ్ తో వస్తున్న లారీని సైడ్ నుంచి ఢీకొని, దాని వెనుకలనే వస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సును ఢీ కొట్టింది. దీంతో వ్యాన్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. వ్యాన్ డ్రైవర్ కు, బస్సులోని ఓ ప్రయాణికుడికి స్వల్ప గాయాలు కాగా, ఈ ప్రమాదంతో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున దాదాపు ఐదు కిలోమీటర్లు ట్రాఫిక్ నిలిచింది. వెంటనే పోలీసులు చేరుకొని, ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఇది ఇలా ఉండగా, ట్రాఫిక్ లో ఓ లారీ ముందు ఉన్న కారును ఢీకొనడంతో ట్రాఫిక్ కు మరింత అంతరాయం ఏర్పడింది. బియ్యం లారీ డ్రైవర్ బోదాసు తిరుపతి ఫిర్యాదు మేరకు ఐచర్ వ్యాన్ డ్రైవర్ దీపక్ మీనన్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## డంపింగ్ యార్డుతో ఇబ్బందులు

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**కలంజ్యోతి, నర్సాపూర్ :** డంపింగ్ యార్డు వల్ల నర్సాపూర్ అడవి నాశనం కావడమే కాకుండా, ఈ ప్రాంతమంతా కాలుష్య మవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్యారానగర్ లో డంప్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల నర్సాపూర్ అడవి ప్రాంతం లోని అర్బన్ పార్క్ రాయరావు చెరువుతో పాటు వేలాది ఎకరాల వ్యవసాయ భూమి కలుషితం అవుతున్నాయన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు అక్కడి పరిధిలోనే చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కానీ ఆ పరిధి దాటి ప్యారా నగర్లో పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. డంప్ యార్డు కు 2008, 2009 లోనే అనుమతులు వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పై బట్ట కాల్చి మీద వేయడం మంచిది కాదని ఎమ్మెల్యే హితవు పలికారు.





## ఘనంగా బ్రహ్మోత్సవాలు

**కలంజ్యోతి, గీసుగొండ :** మండలంలని ఎలుకుర్తి హవేలీ గ్రామంలో గల శ్రీవేణుగోపాల స్వామి సహిత శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి సహకరిస్తానన్నారు.

## కలంజ్యోతి



# బాస్ మోడ్ ఆన్

అలనాటి స్టార్ హీరోయిన్ శ్రియ శరణ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది. అలాగే తన అందం అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి పాపులారిటీ సంపాదించుకున్నది. స్టార్టింగ్ ట్రెడిషనల్‌గా ఆకట్టుకున్న ఈ భామ.. 'మల్లన్న' సినిమాతో బోల్డ్‌గా రెచ్చిపోయింది. దీంతో ఈ అమ్మడు పై నెగిటివిటీ రావడమే కాకుండా ట్రోలింగ్ కూడా పెద్ద ఎత్తున చేశారు. అంతేకాకుండా అప్పటి నుంచి అవకాశాలు రావడం చాలా వరకు మానేశాయి. దీంతో చేసేది ఏమి లేక ఇండస్ట్రీకి దూరం అయింది. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ప్రేమించి పెళ్లి చేసుకుంది. ప్రజెంట్ ఈ ముద్దుగుమ్మకు ఒక పాప ఉంది. నిత్యం తన ఫ్యామిలీకి సంబంధించిన ఫొటోలు, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. కాగా ఈ బ్యూటీ ప్రస్తుతం రీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీగా ఉంది. ఇదిలా ఉంటే.. నిత్యం సామాజిక మాధ్యమాల్లో తన గ్లామర్‌తో పిచ్చేక్కిస్తుంది ఈ అమ్మడు. 42 సంవత్సరాల్లోనూ యంగ్ హీరోయిన్స్‌కి అందం విషయంలో మంచి ఫిజిక్‌ను మెయిన్ టైన్ చేస్తూ గట్టి పోటీ ఇస్తుంది.

ఈ క్రమంలో శ్రియ శరన్ ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా శ్రియ తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోస్ షేర్ చేసింది. అందులో మెరూన్ కలర్ డ్రెస్ వేసుకుని హాట్‌గా ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. అంతేకాకుండా వాటికి 'బాస్ మోడ్ ఆన్' అనే క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. దీంతో ఈ పిక్స్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు స్టన్నింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ బ్యూటీ పోస్ట్ పై మీరు ఓ లుక్ వేసేయండి.